# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 151 మంగళవారం 03, ఫిబ్రవరి 2026 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com





# నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దంటే ఎలా?

## ఎక్కడ ఉంటే అక్కడికే వచ్చి విచారణ చేయాలనడం కరెక్ట్ కాదు

## మీరు చేసిన తప్పులకే అధికారులు నోటీసులు ఇచ్చారు

**అక్రమాలకు పాల్పడిన ఎవరైనా విచారణను ఎదుర్కోవాల్సిందే**

**ఉద్యమకారులను చిత్రహింసలకు గురిచేసిన వారు జాతిపితలు ఎలా అవుతారూ..?**

**బీఆర్ఎస్ పాలనలో ఇబ్బందిపడని ఉద్యమకారుడు లేడు**


**పదేళ్లు తెలంగాణ ప్రజలను విస్మరించారు**

**రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రదానోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, (ప్రజాస్వరం):

అధికారంలో ఉన్నాం కదా అని నేరాలు చేస్తాం.. విచారించొద్దంటే ప్రజాస్వామ్యంలో నడవదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా విచారణ ఎదుర్కోవాల్సిందేనన్నారు. ఆ తప్పు నిరూపణ అయితే శిక్ష అనుభవించాల్సిందేనని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం జరిగిందన్న సీఎం.. అప్పటి ముఖ్యమంత్రిగా ఈ వ్యవహారంపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేసీఆర్ మీద ఉందన్నారు. ఈ కేసులో ఆయనను విచారించడానికి సిట్ అధికారులు నోటీసులు ఇస్తే.. తెలంగాణ జాతిపితకే నోటీసులు ఇస్తారా? అని బీఆర్ఎస్ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్లు తెలంగాణ ప్రజలను విస్మరించన వాళ్లు, ఉద్యమకారులను

..మిగతా 3లో



# సజ్జనార్ జడ్జి కాదు, పోలీస్ అధికారి మాత్రమే..

**ఫోన్ ట్యాపింగ్ ఎక్కడ జరిగిందో వాస్తవాలు చెప్పడం లేదు..**

**సీరియల్ మాదిరి ఫోన్ ట్యాపింగ్ కేసును నడిపిస్తున్నారు..**

**సజ్జనార్ జడ్జి కాదు, పోలీస్ అధికారి మాత్రమే: కేటీఆర్**

హైదరాబాద్, (ప్రజాస్వరం):

ఫోన్ ట్యాపింగ్ ఎక్కడ జరిగిందో వాస్తవాలు చెప్పడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ధారావాహిక సీరియల్ మాదిరి ఫోన్ ట్యాపింగ్ కేసు నడిపిస్తున్నారు.. ఫోన్ ట్యాపింగ్ జరగలేదని నిన్నటి విచారణలో కేసీఆర్ చెప్పారు.. హరీష్ రావుకు సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది.. ఫోన్ ట్యాపింగ్ ఘట్టాన్ని ఇంతటితో ముగించాలని తెలిపారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్ అయినా, ఇంకో అధికారి అయినా ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అనుకుంటే కోర్టుకు వెళ్ళాలి కదా అని సూచించారు. సజ్జనార్ జడ్జీ కాదు , పోలీస్ అధికారి మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. మరి ఈ మధ్య కాలంలో సజ్జనార్ జడ్జీ అయ్యాడేమో నాకు అయితే తెలియదని సెటైర్ వేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడికి పరిచయ కార్యక్రమం ఉంటే రాష్ట్రానికి రావొచ్చు అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.

అయితే, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఏ జిల్లా నాయకత్వం అక్కడ పని చేస్తుంది అని కేటీఆర్ అన్నారు. మేము ఎవరిని బ్లాక్ మెయిల్ చేశామో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చెప్పాలని డిమాండ్ చేశారు. బ్లాక్ మెయిల్ కు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. ఇక, కేసీఆర్ ను సిట్ అధికారులు విచారణకు పిలిస్తే, 7 వేల పైచిలుకు గ్రామాల్లో సీఎం దిష్టి బొమ్మలు తగులబెట్టారని తెలిపారు. ఆనాటి ఉద్యమ స్ఫూర్తి మాకు గుర్తొచ్చింది.. మమ్మల్ని తట్టి లేపిన.. రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు.. ప్రభుత్వానికి పరిపాలన

..మిగతా 2లో

## OTR అప్‌డేట్ తప్పనిసరి

**31 లక్షల అభ్యర్థుల డేటా క్రమబద్ధీకరణ**

**అప్‌లోడ్ చేయాల్సిన వివరాలు**

**చివరి గడువు ఫిబ్రవరి 25**

**OTR మార్చకపోతే కొత్త ఉద్యోగాలకు అప్లై చేయలేరు.!**




02

## మా ఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది ?

**ఫోన్లు ట్యాప్ చేసి..**

**ఉల్టా మాపైనే కేసులు పెట్టారు**

**బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు**

02



# కోర్టు తేల్చకముందే అక్రమమని ఎలా అంటారు?

**తీర్పు ఇవ్వకముందే ఫోన్ ట్యాపింగ్‌ను అక్రమమని చెప్పడం సరికాదన్న హరీశ్**

**సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు పక్షపాత దర్యాప్తునకు నిదర్శనమని విమర్శలు**

**దర్యాప్తు సంస్థలు విచారణకే పరిమితం కావాలి, తీర్పులు ఇవ్వకూడదని హితవు**

**అఖిల భారత సర్వీసుల నిబంధనలను సజ్జనార్ ఉల్లంఘిస్తున్నారని ఆరోపణ**

**కేసీఆర్‌ను ప్రతిపక్ష నేతగా ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించిన హరీశ్**

03



**తెలంగాణ సాధించిన కేసీఆర్ కూడా జాతిపితనే**

02

# సిట్ పిలిస్తే వెళ్తా

**నాతో పాటు నా భర్త ఫోన్లూ ట్యాప్ చేసినట్లుంది**

**గుంట నక్కలతో కలిసి డ్రామాలు**

**విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు**

**త్వరగా పూర్తిచేసి దోషులను శిక్షించాలని డిమాండ్**

**జాగృతి అధ్యక్షురాలు కవిత**



02

## సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన

సంక్షోభంలో రాష్ట్రాన్ని రెండేళ్లలో సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దాం

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం

అభివృద్ధి సంక్షేమ కార్యాక్రమాలను వేగవంతంగా ప్రజల్లోకి చేర్చండి

ఆధునీకరించిన ఐఅండ్ పిఆర్ వెబ్‌సైట్ ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్, (ప్రజాస్వరం):

తెలంగాణ రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కిస్తూ అభివృద్ధి, సంక్షేమం దిశగా పరుగులు పెట్టిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఒక్కో ఇటుకను పేర్చుకుంటూ ముందుకు సాగుతున్నామని అన్నారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆధునికీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను మంత్రి ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న

..మిగతా 2లో



## తెలంగాణకు అప్పుడే తాడిచెర్ల1 గనులు కేటాయించాం

**2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు కేటాయించినట్లు వెల్లడి**

**రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ గురించి స్పందించిన కేంద్రమంత్రి**

**బొగ్గు గనులను ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించడం లేదన్న తమిళనాడు ఎంపీ**



హైదరాబాద్, (ప్రజాస్వరం):

తాడిచెర్ల1 బొగ్గు గనుల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. 2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు దీనిని కేటాయించినట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

..మిగతా 2లో

## కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి తీరని అన్యాయం

**కేంద్రం మాటలు చేతల్లో లేవు**

**ఆయిల్ పామ్, పసుపు రైతులకు నిరాశ**

**ఎరువుల ధరల పెంపుతో అదనపు భారం**

**MSPపై చట్టబద్ధ హక్కు కల్పించలేదు**

హైదరాబాద్, (ప్రజాస్వరం):

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్-2026 తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా రాష్ట్ర రైతాంగానికి తీవ్ర నిరాశ కలిగించింది. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కోట్లాది రైతుల ఆశలను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని

..మిగతా 2లో



## 42 హామీలు ఏమైనట్టు..?

**కేంద్ర బడ్జెట్‌పై మంత్రి ఆగ్రహం**

**విభజన హామీల్లో 42 అంశాలు పెండింగ్**

**IIM, మెట్రో, పరిశ్రమలపై కేంద్రం నిర్లక్ష్యం**

**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని పిలుపు**




03

www.prajaswaramdaily.com WWW.PRAJASWARAMDAILY.COM

# సజ్జనార్ జడ్జి కాదు, పోలీస్ అధికారి మాత్రమే..

**మొదటిపేజీ తరువాయి**

చేయడం రావడం లేదు.. మేడారం జాతరను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని జాతర నిర్వహిస్తారు.. ఈ ప్రభుత్వంలో ఈసారి మేడారం జాతర ఏర్పాటు చేయడంలో విఫల అయింది.. మంత్రి వాహనంపై దాడి చేశారని కేటీఆర్ విమర్శించారు.



# OTR అప్‌డేట్ తప్పనిసరి

- **31 లక్షల అభ్యర్థుల డేటా క్రమబద్ధీకరణ**
- **అప్‌లోడ్ చేయాల్సిన వివరాలు**
- **చివరి గడువు ఫిబ్రవరి 25**
- **OTR మార్చకపోతే కొత్త ఉద్యోగాలకు అప్లై చేయలేరు.!**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రాష్ట్రంలో త్వరలో వెలువడనున్న కొత్త రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకోవాలంటే అభ్యర్థులకు OTR అప్‌డేట్ అనేది ప్రాథమిక అర్హతగా మారింది. ప్రస్తుతం టీజీపీఎస్సీ వద్ద సుమారు 31.56 లక్షల మంది అభ్యర్థుల డేటా ఉంది, అయితే మారుతున్న నిబంధనలు , అభ్యర్థుల విద్యా అర్హతలను దృష్టిలో ఉంచుకుని ఈ డేటాను కమిషన్ క్రమబద్ధీకరిస్తోంది. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ (Scheduled Castes categorization) వంటి ఇటీవలి మార్పులు , అభ్యర్థుల తాజా విద్యార్హతల ఆధారంగా నోటిఫికేషన్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. భవిష్యత్తులో అభ్యర్థులు చేసే దరఖాస్తులు, వారి పరీక్షా ఫలితాలు , తుది ఎంపికలన్నీ OTRలో ఉన్న సమాచారం ఆధారంగానే జరుగుతాయి కాబట్టి, ఇందులో తప్పులు ఉంటే అభ్యర్థులు తమ అర్హతను కోల్పోయే ప్రమాదం ఉంది.

ప్రతి అభ్యర్థి తన OTR ప్రొఫైల్‌లోకి లాగిన్ అయ్యి, అందులో ఉన్న వ్యక్తిగత వివరాలు, చిరునామా, కేటగిరీ , విద్యా అర్హతలు సరిగ్గా ఉన్నాయో లేదో క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. గత రిజిస్ట్రేషన్ తర్వాత అభ్యర్థులు పొందిన కొత్త డిగ్రీలు లేదా అదనపు క్వాలిఫికేషన్లు ఉంటే వాటిని వెంటనే జోడించి, సంబంధిత సర్టిఫికేట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు, అభ్యర్థులు తమ తాజా కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను కూడా అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. ఒక్కసారి డేటా సమర్పించిన తర్వాత కొన్ని కీలకమైన వివరాలు మార్చడానికి వీలుండదు కాబట్టి, అభ్యర్థులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని కమిషన్ సూచించింది. ఈ అప్‌డేట్ ప్రక్రియకు సంబంధించి అభ్యర్థులకు వెసులుబాటు కల్పిస్తూ, చివరి తేదీని 25022026 వరకు పొడిగించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలను సరిచూసుకోవాలి.




# తెలంగాణ సాధించిన కేసీఆర్ కూడా జాతిపితనే

- **హార్వర్డ్ లో చదువుకున్నా గుణం మారలేదు**
- **సీఎం రేవంత్ పై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్**

అమెరికా వెళ్లి హార్వర్డ్ లో నాలుగు రోజులు చదువుకున్నా.. రేవంత్ రెడ్డి తన వెనకటి గుణం మాత్రం మార్చుకోలేదని మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. కనీస సంస్కారంతో పాటు చిల్లర మాటల్లో, వెకిలి చేతల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ద్వేష రాజకీయాలకు, నరం లేని నాలుకతో విషం చిమ్మే కుసంస్కారానికి నిలువెత్తు నిదర్శనం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. దేశానికి గాంధీ జాతిపిత అయినట్లే, తెలంగాణను సాధించిన కేసీఆర్ కూడా జాతిపితే అన్నారు. సోమవారం రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రదానోత్సవంలో కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై హితబోధ చేసిన కొద్ది నిమిషాలు కూడా గడవకముందే.. అదే వేదికపై సీఎం రేవంత్ రెడ్డి తన అసలు స్వభావాన్ని, తన మాటల ద్వారానే బయటపెట్టుకున్నారని విమర్శించారు. హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ముగియకముందే, రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారన్నారు. కేసీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం పెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి తన అజీర్తిని, అక్కసును మరోసారి బయటపెట్టారని అన్నారు. హేట్ స్పీచ్ అంటే ఏమిటో చెప్పడానికి పుస్తకాలు అవసరం లేదు.. రేవంత్ రెడ్డి ప్రసంగాలు చాలు అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. నాలుగు కోట్ల ప్రజలు ఏకమై స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే ఆంధ్రా పాలకుల బూట్లు తుడుస్తున్న నీకు కేసీఆర్ గురించి, తెలంగాణ ఉద్యమం గురించి ఎలా తెలుస్తుంది? అని నిలదీశారు. ఉద్యమకారులపైకి తుపాకి ఎక్కుపెట్టిన నీకు ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు, ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు, కేసులతో నిరంకుశంగా వ్యవహరిస్తున్న నీకు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. అధికారాన్ని ప్రజల బాగు కోసం కాకుండా, ప్రతిపక్షాలపై రాజకీయ కక్షల కోసం వినియోగిస్తున్న నీకు అధికార దుర్వినియోగం గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. లక్కీ లాటరీలో సీఎం అయిన నీకు ఇవన్నీ ఎలా తెలుస్తాయి? ఎలా అర్థం అవుతాయి రేవంత్ రెడ్డి? అని విమర్శించారు. నువ్వు హార్వర్డ్ వెళ్ళినా, అంతరిక్షం వెళ్లినా నీ చెత్త బుద్ధి మారదు, నోటి మురికి పోదు అన్నది సుస్పష్టం అవుతోందని హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు.

# సిట్ పిలిస్తే వెళ్తా

- **నాతో పాటు నా భర్త ఫోన్లు ట్యాప్ చేసినట్లుంది**
- **గుంట నక్కలతో కలిసి డ్రామాలు**
- **విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు**
- **త్వరగా పూర్తిచేసి దోషులను శిక్షించాలని డిమాండ్**
- **జాగృతి అధ్యక్షురాలు కవిత**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను తొందరగా ముగించి దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిట్ విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో అధికారులకు సహకరించేందుకు తాను సిద్ధమని చెప్పారు. అధికారులు పిలిస్తే తాను విచారణకు హాజరవుతానని కవిత తెలిపారు.

ఈ మేరకు ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మొదలై రెండు సంవత్సరాలు గడించిందని గుర్తుచేశారు. విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు గుప్పించారు. విచారణ ఇంకెప్పుడు ముగుస్తుందని, దోషులను ఎప్పుడు శిక్షిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

సిట్ విచారణలో ఏం జరిగిందనే వివరాలను కేసీఆర్ బయటపెడతారని భావిస్తున్నట్లు ఆమె చెప్పారు. కేసు విచారణనే తప్పుబడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడటం సరికాదని కవిత అభిప్రాయపడ్డారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత, అధికారులకు సహకరించాల్సిన విధి ప్రతీ పౌరుడిపైనా ఉందని వ్యాఖ్యానించారు. గుంట నక్కలతో కలిసి డ్రామాలాడుతోందంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె మండిపడ్డారు. తన ఫోన్ ను, తన భర్త ఫోన్‌ను ట్యాప్ చేశారనే అనుమానిస్తున్నట్లు చెప్పిన కవిత.. సిట్ విచారణకు అధికారులు పిలిస్తే వెళతానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



## కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి
# తీరని అన్యాయం

**మొదటిపేజీ తరువాయి**

వ్యవసాయ మంత్రి తుమ్మల తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, ఆయిల్ పామ్ దిగుమతులపై సుంకం పెంపు విషయంలో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీని వలన రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు తీవ్ర నష్టం ఏర్పడే అవకాశం ఉంది. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన బదులు, దిగుమతులకు అనుకూలంగా కేంద్రం వ్యవహరించడం దురదృష్టకరమని మంత్రి అన్నారు.



పసుపు బోర్డు ఏర్పాటుకు నిధుల కేటాయింపు లేకపోవడం, అలాగే పసుపును High Value Cropగా గుర్తించకపోవడం తెలంగాణ పసుపు రైతులకు తీవ్ర నిరాశను కలిగించింది. లక్షలాది మంది పసుపు రైతులు ఎదురుచూస్తున్న Dedicated Funds గురించి బడ్జెట్‌లో స్పష్టమైన ప్రకటన లేకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నార్థకంగా మార్చిందని పేర్కొన్నారు. అదేవిధంగా, కొబ్బరి (కోకనట్) బోర్డు ఏర్పాటు విషయమై కూడా ఎలాంటి ప్రకటన లేకపోవడం రాష్ట్ర రైతాంగానికి మరో ఎదురుదెబ్బగా మారిందన్నారు. ఎరువుల ధరలు పెరిగే అవకాశం ఉందన్న సంకేతాలు రైతులపై మరింత భారం మోపనున్నాయి. ఇప్పటికే పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించే చర్యలు బడ్జెట్‌లో పూర్తిగా లేవని మంత్రి తెలిపారు.

రైతులకు అత్యంత కీలకమైన MSP (కనీస మద్దతు ధర)కు చట్టబద్ధ హక్కు కల్పించడంలో కేంద్రం మరోసారి విఫలమైంది. దీని వలన రైతుల ఆదాయ భద్రతపై అనిశ్చితి మరింత పెరిగిందన్నారు. వ్యవసాయ మార్కెటింగ్, ధరల స్థిరీకరణ, మార్కెట్ సంస్కరణలపై స్పష్టమైన దిశానిర్దేశం లేకపోవడం కేంద్ర బడ్జెట్ లోని ప్రధాన లోపమని అన్నారు. దేశీయ నూనెగింజల రైతులను రక్షించేలా తినుబండార నూనెలపై ఇంపోర్ట్ డ్యూటీలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. కేంద్ర పథకాల ఏకీకరణ పేరుతో తెలంగాణకు వచ్చే నిధుల్లో కోత విధించడం రాష్ట్రానికి తీరని అన్యాయం అని మంత్రి స్పష్టం చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయాలన్న లక్ష్యం ఇప్పటికీ మాటలకే పరిమితమైందని, దానికి స్పష్టమైన రోడ్‌మ్యాప్ బడ్జెట్‌లో ఎక్కడా కనిపించలేదన్నారు.

వ్యవసాయ రంగంలో బడ్జెట్‌లో ప్రస్తావించదగిన ఏకైక అంశం AI ఆధారిత కార్యక్రమాల ప్రస్తావన మాత్రమేనని, అయితే ధర భద్రత, మార్కెట్ భరోసా లేకుండా కేవలం AI రైతు సమస్యలకు పరిష్కారం కాదని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. మొత్తంగా, కేంద్ర బడ్జెట్ -2026 తెలంగాణ రైతాంగానికి ఆశలు నింపడంలో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రానికి ప్రత్యేకంగా యెటువంటి ప్రత్యేక ప్రయోజనం లేకుండా రూపొందించబడిందని మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## మా ఫోన్లు ట్యాప్ చేయాల్సిన
# అవసరం ఏమొచ్చింది ?

- **ఫోన్లు ట్యాప్ చేసి.. ఉల్టా మాపైనే కేసులు పెట్టారు**
- **బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**




ఫోన్లు ట్యాప్ చేసి.. ఉల్టా మాపైనే కేసులు పెట్టారు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మొదట బీజేపీ నేతల ఫోన్లనే ట్యాప్ చేశారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. సంఘ విద్రోహ శక్తులు ఫోన్లను ట్యాప్ చేసినట్లు బీజేపీ నేతల ఫోన్లను ట్యాప్ చేశారని మండిపడ్డారు.. అసలు మా ఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని సీరియస్ అయ్యారు. సోమవారం నాంపల్లి లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. మా ఫోన్లు ట్యాప్ చేసి.. ఉల్టా మాపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ... ఎవరు తప్పు చేసినా జైలుకు పంపుతామని గతంలో కేసీఆర్ అన్నారు.. ఆ మాటలు కేసీఆర్‌కూ వర్తిస్తాయని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై జాలి చూపొద్దని.. దోషులను తప్పకుండా జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను విమర్శించే మూర్ఖులంతా అంధులేనని ఎంపీ రఘునందన్ విమర్శించారు. 'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు సున్నా అని ఒక్కొకరు ఒక్కో తీరుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒకే కుటుంబం నుంచి ఒక్కొక్కరు ఒక తీరుగా వ్యాఖ్యానిస్తున్నారన్నారు. బడ్జెట్‌పై ఒక దిక్కు కేటీఆర్.. ఇంకో దిక్కు హరీశ్‌రావు, కవిత మాట్లాడుతున్నారని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో దక్షిణ భారతదేశానికి ఏడు హైస్పీడ్ రైళ్లు కేటాయిస్తే అందులో హైదరాబాద్‌కు మూడు హైస్పీడ్ రైళ్లు కేటాయించడం జరిగిందని చెప్పారు. ఈ విషయం.. బావబామ్మర్దులకు కనిపించడం లేదా?, అని ప్రశ్నించారు. గత బడ్జెట్ కంటే రైల్వే రంగానికి ఈసారి 15 శాతం ఎక్కువ బడ్జెట్ కేటాయించామన్నారు ఈ బడ్జెట్‌లో తెలంగాణకు సున్నా అని చెబుతున్నరాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఓసారి బడ్జెట్‌ను పరిశీలించాలని సూచించారు. గతంలో కంటే ఈసారి రూ.1300 కోట్లు రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేటాయించారని రఘునందన్ రావు స్పష్టం చేశారు.

## సంక్షేమానికి కేరాఫ్
# కాంగ్రెస్ పాలన

**మొదటిపేజీ తరువాయి**

ప్రతి నిర్ణయాలు ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పునకు నాంది పలుకుతోందని అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన ఇలా అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను ఆదర్శంగా నిలుపుతున్నాయని మంత్రి అన్నారు.

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకుని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సమాచార శాఖ అధికారులకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.



## తెలంగాణకు అప్పుడే తాడిచెర్ల-1
# గనులు కేటాయించాం

**మొదటిపేజీ తరువాయి**

రాజ్యసభలో వెల్లడించారు. 2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆమోదం అనంతరం, 2020 జూన్ నుంచి బొగ్గు గనుల కేటాయింపుల ప్రక్రియ మారినట్లు తెలిపారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ గురించి కేంద్రమంత్రి స్పందించారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కేంద్ర బడ్జెట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి 202627 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, ఇది తెలంగాణ ప్రజలను నిరాశపరిచిందని అన్నారు. 2020 జూన్ నుంచి బొగ్గు వేలం ప్రక్రియలో ప్రభుత్వరంగ సంస్థలకు బొగ్గు బ్లాక్‌లు కేటాయించలేదని తమిళనాడుకు చెందిన ఎంపీ డాక్టర్ తంబిదురై అన్నారు. వేలం ప్రక్రియలో రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రైవేటు రంగ కొనుగోలుదారులకు కట్టపెడుతున్నారని ఆరోపించారు. దీంతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ, తెలంగాణ విద్యుత్ సంస్థకు తాడిచెర్ల1 బొగ్గు గనులను కేటాయించినట్లు తెలిపారు.



# నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దంటే ఎలా?

**మొదటిపేజీ తరువాయి**



చిత్రహింసలకు గురిచేసిన వారు జాతిపిత లు ఎలా అవుతారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. నిజమైన తెలంగాణ జాతిపిత అయితే దేనికి ఆదర్శం అని అడిగారు. బీఆర్ఎస్ పాలనలో ఇబ్బందిపడని ఉద్యమకారుడు లేడన్నారు. ఎంతో మంది ఉద్యమకారులను అరెస్టులు చేసి వేధించారని ఆరోపించారు. ఇళ్ల తలుపులు బద్దలు కొట్టి.. బెడ్ రూమ్‌ల నుంచి ఈడ్చుకెళ్లిన ఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇప్పుడు అవేమీ కనిపించడం లేదని చెప్పారు. సోమవారం హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని రావి నారాయణ రెడ్డి మెమోరియల్ ఆడిటోరియంలో ప్రతిష్టాత్మక 'రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డుప్రదానోత్సవ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. పదవులు, రూ. వేలకోట్ల ఆస్తులు సంపాదించుకున్న మీరు ఉద్యమకారులు ఎలా అవుతారని సీఎం ప్రశ్నించారు. ఆనాడు జాతిపిత గాంధీజీ పదవులను త్యాగం చేసి దుర్మార్గుల తూటాలకు ప్రాణాలు వదిలారని చెప్పారు. మరి ఇప్పుడు జాతిపిత అని చెప్పుకుంటున్న వాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులను ఏకం చేసి ఉద్యమాన్ని నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారుడు కాదా? అని నిలదీశారు. గతంలో తలుపులు బద్దలు కొట్టి ఆయన్ను అరెస్టు చేసింది మీ పాలనలో కాదా.. అప్పుడు ఉద్యమకారులు గుర్తుకురాలేదా? అని దుయ్యబట్టారు. పోలీసులు మిమ్మల్ని అలా తలుపులు బద్దలు కొట్టి తీసుకురాలేదనే విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. కేవలం నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారన్నారు. రావి నారాయణ రెడ్డి లాంటి వారు తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని సీఎం చెప్పారు. అక్రమ మార్గం ఎంచుకున్న వారు ప్రజాస్వామ్యంలో విచారణ ఎదుర్కోవాల్సిందే అని అంబేద్కర్ చెప్పారనీ.. మరోవైపు శిబు సోరెన్ లాంటి వాళ్లూ విచారణ ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. కేసీఆర్ దైవాంశ సంభూతుడేం కాదన్నారు. మధ్య యుగాల చక్రవర్తులు తమ బాధను రాజ్యం బాధగా ప్రచారం చేసేవారన్న సీఎం... ఇప్పుడా మధ్య యుగాల చక్రవర్తులకు కాలం చెల్లిందని చురకలంటించారు. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించినప్పుడు అర్థం చేసుకోవాలన్న ఆయన హుందాగా వ్యవహరిస్తే కొంతైనా మీ గౌరవం నిలబడేదని కేసీఆర్‌ను ఉద్దేశించి చెప్పారు. ప్రజలే తప్పు చేశారని చెప్పడం.. ఇదెక్కడి ప్రజాస్వామ్యం ? ఇదెక్కడి ఉద్యమకారుడి లక్షణం ? ఇదెక్కడి జాతిపిత లక్షణం? అన్నారు. కేసీఆర్ చేసిన తప్పులకే సిట్ అధికారులు ఆయనకు నోటీసులు ఇచ్చారని చెప్పారు. అయితే తాను ఎక్కడ ఉంటే అక్కడికే వచ్చి విచారణ చేయాలనడం కరెక్ట్ కాదన్న రేవంత్ రెడ్డి... అక్రమాలకు పాల్పడిన ఎవరైనా విచారణను ఎదుర్కోవాల్సిందే అన్నారు. వచ్చిన తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబ సభ్యులే పంచుకున్నారని సీఎం విమర్శించారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుందన్నారు. ఆ ప్రజా తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని రావి నారాయణరెడ్డి చాటిచెప్పారని సీఎం వ్యాఖ్యానించారు. దేశంలో అధిక మెజారిటీతో గెలిచిన ఎంపీగా రావి నారాయణ రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. ఆయన అన్ని పదవులను త్యాగం చేసిన గొప్ప నాయకుడన్నారు. కానీ ఈ రోజుల్లో ప్రజలు ఓడించినా పదవులు వదులుకునేందుకు ఇష్టపడటంలేదని కేసీఆర్ ను ఉద్దేశించి చెప్పారు. కేంద్రంలో అధికారంలో బీజేపీ రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కాలరాసేలా ఎస్ ఐ ఆర్‌ను తీసుకువచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ కేంద్ర కుట్రపై కమ్యూనిస్టులు గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. బీజేపీ పాలనలో రాజ్యాంగంపై దాడి జరుగుతోందన్న సీఎం.. దీనిపై ప్రజల్లో చైతన్యం కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

# కోర్టు తేల్చకముందే అక్రమమని ఎలా అంటారు?

- న్యాయస్థానం తీర్పు ఇవ్వకముందే ఫోన్ ట్యాపింగ్‌ను అక్రమమని చెప్పడం సరికాదన్న హరీశ్
- సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు పక్షపాత దర్యాప్తునకు నిదర్శనమని విమర్శలు
- దర్యాప్తు సంస్థలు విచారణకే పరిమితం కావాలి, తీర్పులు ఇవ్వకూడదని హితవు
- అఖిల భారత సర్వీసుల నిబంధనలను సజ్జనార్ ఉల్లంఘిస్తున్నారని ఆరోపణ
- కేసీఆర్‌ను ప్రతిపక్ష నేతగా ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించిన హరీశ్

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**



ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) చీఫ్ వీసీ సజ్జనార్ తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. న్యాయస్థానం తుది తీర్పు ఇవ్వకముందే ఫోన్ ట్యాపింగ్‌ను "అక్రమం" అని అధికారికంగా ఎలా ప్రకటిస్తారని ఆయన ప్రశ్నించారు. సిట్ చీఫ్ హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చట్టబద్ధంగా నిలవదని, ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయమని అన్నారు.

ఈ అంశంపై హరీశ్ రావు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో, ఒక ఆరోపణ నేరమని తేల్చాల్సింది న్యాయస్థానం మాత్రమేనని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం, నిందితుడు నిరపరాధి అనే భావన ప్రాథమిక సూత్రమని, దీనిని విస్మరించరాదని అన్నారు. దర్యాప్తు చేయడం మాత్రమే పోలీసుల విధి అని, విచారణ దశలోనే ఒక చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి వారేమీ న్యాయమూర్తులు కాదని హరీశ్ రావు అభిప్రాయపడ్డారు.

ఒక ఫోన్ సంభాషణను రహస్యంగా వినడం చట్టబద్ధమా, కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని నిబంధనలకు లోబడి ఉంటుందని వివరించారు. అలాగే, పీయూసీఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా జరిగిందా లేదా అన్నది న్యాయ సమీక్ష ద్వారానే తేలుతుందని, పోలీసుల అధికారిక సందేశాల ద్వారా కాదని అన్నారు.

"అక్రమ ఫోన్ ట్యాపింగ్" అనే పదాన్ని అధికారికంగా ఉపయోగించడం ద్వారా, సిట్ చీఫ్ దర్యాప్తు ఫలితంపై ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టమవుతోందని హరీశ్ రావు ఆరోపించారు. ఆయన ప్రవర్తన తను నిర్వహిస్తున్న పదవికి తగనిదని, సీనియర్ అధికారులు పాటించాల్సిన నిష్పాక్షికత, సమగ్రతకు సంబంధించిన అఖిల భారత సర్వీసుల (ప్రవర్తనా) నిబంధనలు, 1968కు ఇది పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేతకు సంబంధించిన అత్యంత రాజకీయ ప్రాధాన్యమున్న కేసులో ఇలాంటి తొందరపాటు నిర్ధారణలు చేయడం వల్ల దర్యాప్తు రాజకీయ ప్రేరేపితంగా, పక్షపాతంతో సాగుతోందనే అనుమానాలకు తావిస్తోందని అన్నారు. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగడమే కాదు, అలా జరిగినట్లు ప్రజలకు కనిపించాలని సుప్రీంకోర్టు పలుమార్లు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడానికి లేదా రాజకీయ కథనాలను ముందుకు తీసుకెళ్లడానికి పోలీసుల అధికారిక ప్రకటనలను వాడుకోరాదని హరీశ్ రావు హితవు పలికారు. దర్యాప్తు సంస్థలు చట్టపరిధిలో స్వతంత్రంగా పనిచేయాలని డిమాండ్ చేశారు. తీర్పులు ఇవ్వాల్సింది కోర్టులే తప్ప పోలీసుల సందేశాలు కాదని, రాజ్యాంగ పరిమితులను సంస్థలు అతిక్రమిస్తే ప్రజాస్వామ్యం మనలేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా, "కేసీఆర్ గారిని గౌరవ ప్రతిపక్ష నేతగా సిట్ చీఫ్ ఎందుకు గుర్తించడం లేదో తెలంగాణ ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారు" అని హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. నిన్న కేసీఆర్ విచారణ అనంతరం సిట్ చీఫ్ సజ్జనార్ చేసిన ట్వీట్ కు ప్రతిస్పందనగా హరీశ్ రావు ఈ మేరకు ట్వీట్ చేశారు.



## కాప్రా సర్కిల్‌లో చోరీ ఘటన...
# బంగారం అపహరణ

- తాళం వేసి సొంతూరికి వెళ్లిన కుటుంబం... తిరిగొచ్చేసరికి ఇల్లు గుల్ల

**కాప్రా ఫిబ్రవరి 2 (ప్రజాస్వరం):**

కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాప్రా సర్కిల్ ఏఎస్ రావు నగర్ డివిజన్ భవానీ నగర్‌లో చోరీ ఘటన చోటుచేసుకుంది. కుషాయిగూడ పోలీసుల కథనం ప్రకారం, భవానీ నగర్‌లో నివసించే ప్రైవేట్ ఉద్యోగి కోలుకుల వెంకటసుబ్బరావు కుటుంబంతో కలిసి గత నెల 30న ఇంటికి తాళం వేసి స్వస్థలం మాచర్లకు వెళ్లారు. సోమవారం (2వ తేదీ) తెల్లవారుజామున ఇంటికి తిరిగివచ్చేసరికి ప్రధాన ద్వారం తాళం విరిగి ఉండటంతో పాటు, పడకగదిలోని బీరువాలు తెరిచి ఉండటాన్ని గమనించారు. పరిశీలించగా ఇంట్లో నుంచి 4 తులాల 4 గ్రాముల (44 గ్రాముల) బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# 42 హామీలు ఏమైనట్టు..?

- కేంద్ర బడ్జెట్‌పై మంత్రి ఆగ్రహం
- విభజన హామీల్లో 42 అంశాలు పెండింగ్
- IIM, మెట్రో, పరిశ్రమలపై కేంద్రం నిర్లక్ష్యం
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని పిలుపు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, పూర్తిగా నిరాశజనకంగా ఉందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర విభజన జరిగి ఇన్నేళ్లవుతున్నా, విభజన చట్టంలోని 42 కీలక అంశాలు నేటికీ పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉండటం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సమావేశాల్లోనైనా ఆ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించామని, కానీ కేంద్రం మళ్ళీ మొండిచేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రం వెంటనే స్పందించి విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రానికి రావాల్సిన ప్రతిష్టాత్మక సంస్థల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న తీరును శ్రీధర్ బాబు ఎండగట్టారు. తెలంగాణకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (IIM) వంటి ఉన్నత విద్యాసంస్థ వస్తుందని రాష్ట్రం ఎంతో ఆశగా ఎదురుచూసిందని, కానీ బడ్జెట్‌లో దాని ఊసే లేకపోవడం దారుణమన్నారు. అలాగే హైదరాబాద్ నగరవాసుల చిరకాల స్వప్నమైన మెట్రో ఫేజ్ 2 విస్తరణకు నిధులు కేటాయిస్తారని ఆశించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. విద్యా రంగంలో కేంద్రీయ, నవోదయ విద్యాలయాల కేటాయింపులో కూడా రాష్ట్రానికి మొండిచేయి ఎదురైందని విమర్శించారు. ఐటి, పారిశ్రామిక రంగంలో కీలకమైన సెమీ కండక్టర్ చిప్స్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలను తెలంగాణకు కేటాయించడంలో కేంద్రం పక్షపాత ధోరణి ప్రదర్శిస్తోందని, గతంలోనూ ఇదే జరిగిందని ఆయన గుర్తు చేశారు.

తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ పార్లమెంట్ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను సాధించడంలో వారు పూర్తిగా విఫలమయ్యారని మంత్రి విమర్శించారు. ఇంతమంది ఎంపీలు ఉండి కూడా నిధులు రాకపోవడం బాధాకరమని, ఇది రాష్ట్ర ప్రజలకు జరిగిన అవమానమని పేర్కొన్నారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న లైఫ్ సైన్సెస్ , ఫార్మా పాలసీలను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకోవడం మన పాలనకు నిదర్శనమని చెప్పారు. అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, కేంద్రం కూడా తన బాధ్యతను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలకు నిధులు విడుదల చేయాలని కోరారు.

రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో మంత్రి శ్రీధర్ బాబు ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టణ ప్రాంత ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. పట్టణ ప్రజలకు న్యాయం జరగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మున్సిపల్ శాఖ బాధ్యతలను నిర్వహిస్తూ, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు , సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వివరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తామని, మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

# సర్వే 120 ప్రభుత్వ భూమి కబ్జా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం




- చర్యలకు రెవెన్యూ అధికారులు వెనకడుగు

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 2(ప్రజాస్వరం):**

దుండిగల్ మండల పరిధిలో గండి మైసమ్మలోని సర్వే నంబర్ 120 ప్రభుత్వ భూమి కబ్జారాయుళ్ల చేత అక్రమంగా ఆక్రమించబడుతుంది. ప్రభుత్వ భూమి హారతి కర్పూరంలా కరిగిపోతున్న రెవెన్యూ అధికారులు మాత్రం స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు సమస్యను అధికారులకు తెలియజేసినా, తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూమిని పలు ప్రభుత్వ కార్యాలయాల అవసరాలకు ఉపయోగించాల్సి ఉన్నప్పటికీ, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ భూమి అక్రమ నిర్మాణాలకు దారితీస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులను తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# 20 ఏళ్ల తర్వాత కలిసిన ZPHS సర్దార్‌నగర్ 2006–07 బ్యాచ్

**షాబాద్,ఫిబ్రవరి 02(ప్రజాస్వరం):**

ZPHS సర్దార్‌నగర్ పాఠశాలలో 2006-2007 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు 20 సంవత్సరాల అనంతరం మళ్లీ కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల రోజులను గుర్తు చేసుకుంటూ, పాత స్నేహితులతో గడిపిన అనుభవాలను పరస్పరం పంచుకున్నారు.ఈ సమావేశం సందర్భంగా గురువుల బోధన, క్రమశిక్షణ, విలువలు తమ జీవితాలకు బలమైన పునాదిగా నిలిచాయని విద్యార్థులు తెలిపారు. గురువులు ఇచ్చిన మార్గదర్శనం వల్లే తాము ఈ స్థాయికి చేరుకున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం స్నేహ బంధాలను మరింత బలపరిచేలా ఆత్మీయంగా సాగింది.ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాబోధన చేసిన లక్ష్మణ్ సార్, లెమ్యూయెల్ సార్, ఉమాదేవి టీచర్, నిర్మల్ టీచర్, సుష్మా టీచర్ అటెండర్ మసూద్,లకు ఘనంగా సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు.




# నేటినుండి సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం ఎంపీడీఓ మున్వర్

**కొత్తగూడ, ఫిబ్రవరి 2(ప్రజాస్వరం):**



నేటి(03/02/2026) నుండి ప్రారంభం అయ్యే మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలకు క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలనీ కొత్తగూడ ఎంపీడీఓ మున్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మున్వర్ మాట్లాడుతూ సీఎం కప్ క్రీడలు మండల కేంద్రం లోని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ హై స్కూల్ నందు ఉదయం 9 గంటల నుండి ప్రారంభమగునని ఈ క్రీడలకు సంబంధించి ఆన్లైన్‌లో నమోదు చేసుకున్న ప్రింట్ కాఫీతో హాజరు కాగలరని తెలిపారు. ఈ క్రీడలు ప్రధానంగా అథ్లెటిక్స్ , కబడ్డీ ,, ఖో ఖో,,వాలీబాల్, చెస్, క్యారం వివిధ రకాల పోటీలు నిర్వహించడం జరుగుతుందని పోటీలకు వచ్చేవారు తమకు అవసరమైన క్రీడా వస్తువులు మరియు దుస్తులు మరియు వ్యక్తిగత సామాగ్రి తమ వెంట తీసుకుని రావాలని కోరారు.క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు అందరూ కలిసి ఈ సీఎం కప్ పోటీలను విజయవంతంగా చేయాలని కోరారు.



## భద్రాచలం పట్టణ ప్రముఖుల ఆధ్వర్యంలో జగదీష్ కాలనీ పాఠశాలలో రక్తదాన శిబిరం

- **తలసేమియా వ్యాధిగ్రస్థులకు సంకల్ప స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా భద్రాచలం లో రక్త దాన శిబిరం ఏర్పాటు**

**భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 02 (ప్రజాస్వరం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం జగదీష్ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో, భద్రాచలం పట్టణ ప్రముఖులు ఆధ్వర్యంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఖమ్మం వారు సహకారంతో తలసేమియా వ్యాధిగ్రస్తులకు నిర్వహించబడిన రక్తదాన శిబిరం విజయవంతంగా జరిగింది. మనదేశంలో మహమ్మారిలా మారిన తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఎన్నో సంవత్సరాల నుండి సంకల్ప స్వచ్ఛంద సంస్థ ద్వారా రక్తం ఎక్కించడం మరియు మందులతో వ్యాధిగ్రస్తులను కాపాడుతున్నారు.మరియు భద్రాచలం పట్టణ ప్రముఖులు లక్ష్మణ్ మరియు వారి కుటుంబం మరియు వారి స్నేహితులు కలిసి ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా పట్టణ ట్రాఫిక్ ఎస్సై తిరుపతి రావు మరియు హెచ్ఎం రాజా శ్రీనివాస్ మరియు ఇర్పా అనసూయ 20వ వార్డ్ మెంబర్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని లక్ష్మణ్ తెలియజేశారు. అలాగే రక్తదానం గురించి దాని యొక్క ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కలు తెలుసుకోవాలని రక్తదానం చేసి పదిమంది ప్రాణాలు కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలంలో పట్టణ ప్రముఖులు లక్ష్మణ్ రావు, చరణ్,సారిక, చరణ్య,కుంజ ధర్మ, కుంజా సంతోష్, అన్వేష్ రెడ్డి, పృథ్వి,వేణు గోపాల్ రెడ్డి గుజ్జుల , రెహమాన్,అబ్దుల్లా,రవిచంద్ర సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఖమ్మం వారు పాల్గొన్నారు.



### బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులకు

## బీ–ఫారమ్‌ల పంపిణీ.

- **మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తాం.**
- **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి. జిల్లా బిజెపి అధ్యక్షులు డి నారాయణ.**

**వనపర్తి,ఫిబ్రవరి 2 (ప్రజాస్వరం):**

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాబోయే మున్సిపాలిటీ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనే దిశగా బీజేపీ వేగంగా ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో పట్టణంలోని మొత్తం 33 వార్డులకు సంబంధించిన బీజేపీ అభ్యర్థులకు బీ-ఫారమ్‌లను బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీ డి.నారాయణ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి అభ్యర్థులకు అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగరేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడమే బీజేపీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు డి. నారాయణ బీజేపీ మున్సిపల్ అభ్యర్థి తన సతీమణి నిర్మల కు తన చేతుల మీదుగా బీ-ఫారమ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళా సాధికారతకు బీజేపీ ఎప్పుడూ పెద్దపీట వేస్తోందని, పట్టణ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసి బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, స్వచ్ఛత, ప్రజా సంక్షేమ పథకాల అమలే బీజేపీ ప్రధాన అజెండా అని నేతలు స్పష్టం చేశారు. ప్రజల నమ్మకంతో పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా వెల్లడించారు.



## రింగు రోడ్డులో గుంతలు పూడ్చాలి: తాటి

- **అశ్వారావుపేట రింగు రోడ్డులో గుంతలపై ఆందోళన**

**అశ్వారావుపేట,ఫిబ్రవరి 2(ప్రజాస్వరం):**



అశ్వారావుపేట పట్టణ రింగు రోడ్డులో ఏర్పడిన భారీ గుంతల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా రింగు రోడ్డులో ఉన్న గుంతలను వెంటనే పూడ్చి, రోడ్డు మార్మతులు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌ను ఆయన కోరారు. నిర్లక్ష్యం కొనసాగితే ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

# గుర్తుల కేటాయింపులో పొరపాట్లు జాగ్రత్త వహించండి.

- **అధికారులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి.**

**వనపర్తి,ఫిబ్రవరి 2 (ప్రజాస్వరం):**





మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా పోటీ చేయబోయే అభ్యర్థులకు గుర్తు కేటాయింపు ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థుల ఉపసంహరణ, గుర్తుల కేటాయింపుపై పలు సూచనలు జారీ చేశారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ వేసి పోటీ నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులు తప్పనిసరిగా స్వయంగా వచ్చి ఉపసంహరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రతిపాదిత వ్యక్తి లేదా ఏజెంట్ ఉపసంహరణ పత్రం సమర్పించిన పక్షంలో, అధికారులు తప్పనిసరిగా సంబంధిత అభ్యర్థికి ఫోన్ చేసి నిర్ధారించుకోవడమే కాకుండా పత్రాలపై ఉన్న సంతకాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అభ్యర్థుల ఉపసంహరణకు మంగళవారం మధ్యాహ్నం 3.00 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఆ తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపసంహరణలు అంగీకరించబోమని స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం 4.00 గంటలకు అభ్యర్థులతో సమావేశం నిర్వహించి, ఎన్నికల గుర్తులను కేటాయించనున్నట్లు తెలిపారు. పోలింగ్, కౌంటింగ్‌కు సంబంధించి అభ్యర్థుల ఏజెంట్లందరికీ అవసరమైన గుర్తింపు కార్డులను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఒక అభ్యర్థికి ఒక ఏజెంట్‌కు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది అందరూ తమకు కేటాయించిన హ్యాండ్‌బుక్‌ను పూర్తిగా చదివి నియమ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న రిటర్నింగ్ అధికారులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారమ్-12 నింపి వెంటనే సమర్పించాలని తెలిపారు. అర్హులైన సిబ్బంది ఈ నెల 8వ తేదీన తమ పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య, డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్ రెడ్డి, టీవోటీ శ్రీనివాసులు, ఆర్వోలు ,ఏఆర్వోలు తదితర అధికారులు పాల్గొన్నారు.



## కొత్తగా తెచ్చిన విబి.జీ రామ్ జీ బిల్లును ఉపసంహరించుకోవాలి.

- **సిర్పంగి స్వామి**

**వలిగొండ,ఫిబ్రవరి 2(ప్రజాస్వరం):**

వామపక్ష పార్టీల, వ్యవసాయ కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 సంవత్సరంలో ఫిబ్రవరి 2న వామపక్ష పార్టీల మద్దతుతో యూపీఏ1 ప్రభుత్వం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా బిజెపి ప్రభుత్వం ఈ పథకం పేరును మార్చడంతో పాటు కూలీలకున్న అనేక హక్కుల్ని తొలగించే విధంగా వ్యవహరిస్తున్న పద్ధతిని నిరసిస్తూ సోమవారం రోజున సుంకిశాల గ్రామంలో నిరసన తెలియజేసిన అనంతరం పథకాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ 2005 సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వచ్చిందని 2006 నుండి నేటి వరకు దేశములో అనేక మంది పేదలకు ఉపయోగపడిందన్నారు. కూలీలకు ఇబ్బందులు కలిగే కలిగించే కుట్టలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 90% నిధులు ఇవ్వాల్సింది ఉండగా 60% నిధులు ఇస్తామని చెప్పి కేంద్ర0 బడ్జెట్లో కూడా 3 లక్షల కోట్లు పెట్టాల్సింది పోయి 95000 కోట్లే బడ్జెట్ పెట్టడం అంటే ఉపాధి హామీని ఎత్తేయడమేనని అన్నారు. బిజెపి కేంద్రంలో 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఏ ఒక్కరికి పనిముట్లను ఇవ్వలేదని,ఉపాధిలో ఉన్నటువంటి నిరుద్యోగ భృతి, మెడికల్ కిట్లు, టెంట్లు, మంచినీళ్లు, సౌకర్యాల్ని తొలగిస్తుందని అన్నారు.మహాత్మా గాంధీ గారు గ్రామ సీమలు అభివృద్ధి అయితేనే దేశం అభివృద్ధి అవుతుందని అన్నారని,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పేరును మార్చడం వలన ఈ గ్రామీణ పేదలందరినీ అనగదొక్కే కుట్ర కేంద్ర ప్రభుత్వం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కొండే కిష్టయ్య, రైతు సంఘం మండల నాయకులు మంగ బాలయ్య,మండల ఉపాధ్యక్షులు కొండూరు సత్తయ్య, స్థానిక వార్డు సభ్యులు ఈర్లపల్లి నరసింహ,కాటేపల్లి వనజ, నాయకులు ఇతాప నగేష్ కాటేపల్లి వెంకటేశం,పోలేపల్లి స్వామి,మంగ శ్రీను,పోలేపల్లి ఉప్పలయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### ఫిబ్రవరి 21,22 తేదీల్లో తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాలు

- **పోస్టర్ ఆవిష్కరించిన ఏ. వి. కాలేజి ప్రిన్సిపాల్ డా. రాజలింగం, తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి**

**హైదరాబాద్ ఫిబ్రవరి 02(ప్రజాస్వరం):**



తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాలు ఫిబ్రవరి 21, 22 తేదీల్లో ఏ.వి. కాలేజీలో జరుగుతున్నట్టు తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి తెలిపారు. సోమవారం ఏ.వి. కాలేజిలో ఆయన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. రాజలింగం, పత్రికా సంపాదకులు ఆర్. రమేశ్ లతో కలిసి దశాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనందాచారి మాట్లాడుతూ తెలంగాణ సాహితి పదేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ఇప్పటి వరకు ఐదు లిటరరీ ఫెస్టులు నిర్వహించామని అన్నారు. 6వ లిటరరీ ఫెస్ట్ ను దశాబ్ది ఉత్సవాలుగా ఏ.వి. కళాశాల తెలుగు శాఖతో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా డిగ్రీ, పీజీ విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ అనే అంశంపై కవితలు, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రముఖ సాహితీవేత్తలు, ఇతర రాష్ట్రాల ప్రముఖులు హాజరు అవుతున్నారని చెప్పారు. ఏ. వి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. రాజలింగం మాట్లాడుతూ తెలంగాణ సాహితి నిర్వహిస్తున్న లిటరరీ ఫెస్ట్ లో మా కళాశాల భాగస్వామ్యం కావడం మంచి అవకాశంగా భావిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు సాహిత్యాన్ని చేరువ చేయడానికి ఇలాంటి ఉత్సవాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ ఫెస్ట్ లో కళాశాల తెలుగు శాఖ పూర్తి భాగస్వామ్యం వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితి రాష్ట్ర కోశాధికారి అనంతోజు మోహన్ కృష్ణ, సహాయ కార్యదర్శి ఎస్. కె. సలీమ, ఏవి కాలేజీ తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ జి.భాస్కర్ యాదవ్, భౌతిక శాస్త్ర విభాగ శాఖ అధ్యక్షులు మంజుల దేవి, రసాయన శాస్త్ర విభాగ అధ్యక్షులు అధ్యక్షులు డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధారాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ హరిప్రియ, అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- **సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం చేకూరుతుందనే భరోసా కల్పించాలి**
- **పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం,ఫిబ్రవరి 02 (ప్రజాస్వరం):**

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ను సోమవారం ఆకస్మికంగా సందర్శించడం జరిగింది.ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.5S అమలులో భాగంగా పోలీస్ స్టేషన్ రికార్డులను ఒక క్రమ పద్ధతిలో అమర్చుకోవాలని అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి ,పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్టికల్స్ వారీగా పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే అధికారులు,సిబ్బంది పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.డయల్ 100 ఫోన్ రాగానే స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రమాద నివారణా చర్యలు చేపట్టాలని తెలిపారు.సైబర్ నేరాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం అక్కడ విధులలో ఉన్న సిబ్బంది సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్,ఎస్సై శ్రీనివాస్,టీజీఎస్పీ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.




## సీఎం రేవంత్ రెడ్డికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 02 (ప్రజాస్వరం ):**

తెలంగాణ రైజింగ్-2047లో భాగంగా దావోస్ పెట్టుబడుల సదస్సులో పాల్గొని రాష్ట్ర పెట్టుబడి అవకాశాలను వివరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో నాయకత్వ శిక్షణ పూర్తి చేసి పట్టా పొందారు. విదేశీ పర్యటన ముగించుకుని సోమవారం తెల్లవారుజామున స్వదేశానికి చేరుకున్న సీఎంకు శంషాబాద్ విమానాశ్రయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఘన స్వాగతం పలికారు.





## కంపెనీ మూతతో గుండెలు ఆగాయి... కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి

- **సూపర్ మాక్స్ గేటు ముందు ఆవేదనతో కార్మికుల ధర్నా**

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 2(ప్రజాస్వరం):**

జీతం రాకపోయినా బతికాం... కానీ అప్పుల భారం తట్టుకోలేక కొందరు ప్రాణాలు వదిలేశారు" — ఈ మాటలు జీడిమెట్ల సూపర్ మాక్స్ కంపెనీ గేటు ముందు కార్మికుల వేదనకు ప్రతిబింబంగా మారాయి. జీడిమెట్ల సూపర్ మాక్స్ కంపెనీ జేఏసీ మరియు వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కంపెనీ గేటు ముందు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఆర్ఎస్‌కేవీ సంఘాలకు చెందిన నాయకులు కీలుకాని లక్ష్మణ్, ఉమామహేష్, గుంజ శ్రీనివాస్, రవి సింగ్ ఈ ధర్నాలో పాల్గొని కార్మికుల కన్నీటి కథను బయటపెట్టారు. మూడు సంవత్సరాలుగా జీతాలు చెల్లించకపోవడంతో కార్మికుల జీవితాలు పూర్తిగా అతలాకుతలం అయ్యాయని నాయకులు తెలిపారు. పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక, ఇంటి అద్దెలు చెల్లించలేక, అప్పుల పాలై తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన కార్మికులు పదుల సంఖ్యలో గుండెపోటుతో మృతి చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన కార్మికుల అంత్యక్రియలకు కూడా సహోద్యోగులు చందాలు వేసుకుని చేయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. ఒకవైపు కార్మికులు కోర్టులు, లేబర్ ఆఫీసులు, రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతూ న్యాయం కోసం చెప్పులు అరిగేలా తిరిగినా ఫలితం లేదని తెలిపారు. మరోవైపు, కంపెనీలోని విలువైన మిషనరీని గుట్టుచప్పుడు కాకుండా వారాల తరబడి జీడిమెట్ల నుంచి హిమాచల్ ప్రదేశ్‌కు తరలించారని ఆరోపించారు. ఈ తరలింపుకు సంబంధించిన లారీలు ఎవరు ఏర్పాటు చేశారో, బిల్లులు ఏ కంపెనీ ద్వారా జారీ చేశారో చెప్పాల్సిన పోలీసులు కూడా సరైన సమాధానం ఇవ్వడం లేదని జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. "ఎన్నికల సమయంలో మాత్రం మేము మీకు అండగా ఉంటాం అని చెప్పిన నాయకులు, మూడు సంవత్సరాలుగా మమ్మల్ని పట్టించుకోలేదు" అని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి తమ బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మేడ్చల్ జిల్లాలోని అన్ని కార్మిక సంఘాలతో కలిసి జేఏసీగా ఏర్పడి, జీడిమెట్ల నుంచి అంజయ్య భవన్ లేబర్ ఆఫీస్ వరకు వేల మందితో పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు. కార్మికులకు న్యాయం జరిగేలా ఐఆర్‌పీ నిర్ణయం తీసుకోవాలని, ఈ మిషనరీ తరలింపు వెనుక పాత యాజమాన్యం మలహోత్రా పాత్రపై అనుమానం ఉందని పేర్కొంటూ, వెంటనే సీఓసీ నుంచి ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సూపర్ మాక్స్ జేఏసీ నాయకులు ఈశ్వర్ రావు, లక్ష్మారెడ్డి,సురేష్, రవీందర్, శ్రీనివాస్‌తో పాటు పెద్ద సంఖ్యలో మహిళా కార్మికులు పాల్గొని తమ జీవన పోరాటాన్ని గళమెత్తారు.



## మట్టిలో మాణిక్యం చెలికాని సునీత

- **సి ఐ ఎస్ ఎఫ్ లో ఉద్యోగం సాధించిన సారపాక యువతి**
- **చిన్ననాటి నుండి ఉద్యోగం సాధించాలనే లక్ష్యం**
- **ఎన్నో అవమానాల నుండి ఉద్యోగం సాధించాలనే పట్టుదల**
- **అభినందన తెలిపి యువతిని ఘనంగా శలవతో సన్మానించిన జాతీయ మాల మహానాడు జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పుట్టి శ్రీనివాసరావు,మాల మహానాడు పినపాక నియోజకవర్గ ఇంచార్జి పిల్లి రవి వర్మ**

**బూర్గంపాడు,ఫిబ్రవరి 02(ప్రజాస్వరం):**



బూర్గంపాడు మండలం సారపాక చెందిన చెలికాని సునీత సి ఐ ఎస్ ఎఫ్ లో ఉద్యోగం సాధించి గ్రామవాసుల అభిమానాన్ని కైవసం చేసుకుంది. చిన్నప్పటి నుంచే ఉద్యోగం చేసి కుటుంబానికి మద్దతు ఇవ్వాలనే పట్టుదలతో రేయి పగలు కష్టపడిన ఆమె ఆర్థిక అడ్డంకులను ఎదుర్కొని ఈ విజయాన్ని సాధించింది.సునీత తన గ్రామంలోని సామాన్య కుటుంబంలో పుట్టింది తండ్రి మరణించినప్పటికీ తల్లి సోదరుడు వ్యవసాయ కూలీ చేసి ఆమెను మంచి భవిష్యత్తును కల్పించాలనే కోరికలో ఉండేవారు కానీ ఆర్థిక ఇబ్బందులు కుటుంబ పరిస్థితులు ఆమె ముందు అడ్డంకిగా నిలిచాయి. చదువు పూర్తి చేసిన తర్వాత ఉద్యోగ అవకాశాల కోసం వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు రాత్రి పగలు కష్టపడింది.కష్టాలు అడ్డుకోలేకపోయాయి. సి ఐ ఎస్ ఎఫ్ కానిస్టేబుల్ పోస్ట్ కోసం జరిగిన పోటీ పరీక్షలో ఆమె విజయవంతమయ్యింది. శారీరక శిక్షణ, రాత పరీక్షలు, ఇంటర్వ్యూ లాంటి దశలన్నీ బాగా దాటి దేశ రక్షణలో పాల్గొనే అవకాశాన్ని సంపాదించింది. ఈ విజయం కేవలం ఆమె పట్టుదలకు మాత్రమే కాక గ్రామ పండితులు, స్నేహితుల మద్దతును కూడా ప్రతిబింబిస్తోంది.సునీత విజయాన్ని చూసి సారపాక మాల మహానాడు సంఘం సంతోషం వ్యక్తం చేసి ఆమెను సన్మానం చేసి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు మాట్లాడుతూ,సునీత లాంటి యువత మాకు మార్గదర్శకులు వారి కష్టాలు, పట్టుదల గ్రామ యువకులకు స్ఫూర్తినిస్తాయి అని అన్నారు. సునీత కూడా మాట్లాడుతూ,నా విజయం కేవలం నాది కాదు నా కుటుంబం, గ్రామస్తుల మద్దతుతో వచ్చింది. ఇలాంటి అవకాశాలు అందరికీ దొరికేలా ప్రయత్నిస్తాను అని పేర్కొంది.ఈ సంఘటన గ్రామీణ యువతకు ఒక మంచి సందేశం. ఆర్థిక ఇబ్బందులు, సామాజిక అడ్డంకులు ఉన్నా పట్టుదలతో ముందుకు సాగితే విజయం సాధ్యమే సునీత వంటి సాధికారతలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో యువతను ప్రేరేపిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో,కృష్ణ సాగర్ బి ఆర్ యస్ రెండో వార్డ్ నెంబర్ ఉసిల్ల రాజేష్,పిల్లి కోటేశ్వరరావు, ఇర్రి యుగంధర్,సాతునూరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.




## తల్లిదండ్రుల మందలింపుతో ఇంటి నుంచి వెళ్లిన ఇద్దరు చిన్నారులు...

- **సీసీ కెమెరాల సహాయంతో రాత్రి లోపే ట్రేస్ చేసిన జీడిమెట్ల పోలీసులు**

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 2:(ప్రజాస్వరం):**



జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి 12 గంటల 30 నిమిషాల సమయంలో ఇద్దరు చిన్నారులు కనిపించకుండా పోవడంతో కలకలం నెలకొంది. జీడిమెట్లకు చెందిన నరేష్ అనే వ్యక్తి తన కుమారుడు, కుమార్తె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే జీడిమెట్ల పోలీసులు సత్వర స్పందన చూపించారు. ఎస్సై నాయుడు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, కానిస్టేబుల్ నరేష్‌తో కలిసి పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. పిల్లల కదలికలను ట్రేస్ చేస్తూ రాత్రి మొత్తం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, తెల్లవారుజామున కల్లా ఇద్దరు చిన్నారులను సురక్షితంగా గుర్తించారు. అమ్మాయి, అబ్బాయి అయిన ఇద్దరు చిన్నారులను వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. విచారణలో తల్లిదండ్రులు చదువుపై నిర్లక్ష్యం చూపుతున్నారని మందలించడంతోనే పిల్లలు ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా పోలీసులు తల్లిదండ్రులకు కీలక సూచనలు చేశారు. పిల్లలను అర్థం చేసుకునే రీతిలో, వారి మనసుకు దగ్గరగా మాట్లాడి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్న వయసులో ఉన్న పిల్లలు కొన్నిసార్లు తొందరపాటు నిర్ణయాలు తీసుకునే అవకాశముంటుందని, అలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు మరింత ఓర్పుతో వ్యవహరించాలని జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేశం తెలిపారు. కేసును అత్యంత చాకచక్యంగా, సమయపాలనతో పరిష్కరించిన ఎస్సై నాయుడు, కానిస్టేబుల్ నరేష్‌లను జీడిమెట్ల సీఐ మరియు స్థానికులు అభినందించారు. రాత్రి వేళలోనే పిల్లలను సురక్షితంగా గుర్తించడం పోలీసుల అప్రమత్తతకు నిదర్శనంగా నిలిచింది.



## సిపిఎం చేపట్టిన ప్రగతి నగర్ సమస్యల వినతిపత్రం – డిప్యూటీ కమిషనర్‌కి సమర్పణ

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 2(ప్రజాస్వరం):**

నిజాంపేట సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్‌లో అనేక ప్రాంతాల్లో డ్రైనేజ్ సమస్యలు తీవ్రమైనవి. డ్రైనేజ్ మ్యానువల్స్ నుండి ఓవర్ ఫ్లో అవడం వల్ల రోడ్లపై నీరు నిలుస్తూ ప్రజలకు నడవటం కష్టంగా మారింది.ప్రగతి నగర్‌లోని రోడ్ల పరిస్థితి కూడా చాలా అస్తవ్యస్తంగా ఉంది. CPM బాచుపల్లి మండల కమిటీ డిప్యూటీ కమిషనర్‌కి వినతిపత్రం సమర్పిస్తూ, ప్యాచ్ వర్క్, కొన్ని రోడ్లను పూర్తిగా కొత్తగా నిర్మించడం, వేసవివర్షాకాలం దృష్టిలో బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరారు. బాచుపల్లి మండల కార్యదర్శి వెంకట రామయ్య తెలిపారు, అనేకసార్లు సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఇంకా పరిష్కారం కుదరకపోవడం ప్రజలను ఇబ్బందులలో పడేస్తోందని. సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సంతోష్,మండల కమిటీ సభ్యులు బాల వెంకటేశ్వరరావు,వెంకటరాజు, కోటేశ్వరరావు,పివిఎన్ రాజు, లక్ష్ముడు,కుమారస్వామి, వెంకట్రావు, స్వామి పాల్గొన్నారు.




## ముని్సపల్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం.

- **వార్డుల అభివృద్ధికి హస్తం గుర్తుపై ఓటేయాలి.**
- **ఎమ్మెల్యే మేఘారెడ్డి.**

**వనపర్తి,ఫిబ్రవరి 2 (ప్రజాస్వరం):**

వనపర్తి మునిసిపాలిటీలోని ప్రతి వార్డు సమగ్ర అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని 13, 14, 17 వార్డుల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు.గత ప్రభుత్వ పాలనతో పోలిస్తే నేటి కాంగ్రెస్ ప్రజాపాలన మధ్య తేడా ప్రజలకు కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజల భాగస్వామ్యంతో కూడిన పాలనను కొనసాగించాలంటే మున్సిపల్ పాలనలోనూ కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకతో ఆయా వార్డుల్లో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు ఎమ్మెల్యేకు తిలకం దిద్ది, మంగళహారతులు ఇచ్చి డప్పు వాయిద్యాల మధ్య పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. స్థానిక కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించిన మేఘారెడ్డి.. హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణంలో గణనీయంగా అభివృద్ధి సాధించామని ప్రతి వీధిలో సిసి రోడ్లు, సైడు కాలువలు నిర్మించామని అన్నారు. 'ఇందిరమ్మ రాజ్యం' ద్వారా ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని ఎమ్మెల్యే వివరించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన వంటి అనేక సంక్షేమ పథకాలతో ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు పట్టణంలోని ప్రతి వార్డుకు చేరాలంటే మున్సిపల్ పాలన కాంగ్రెస్ చేతుల్లో ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, సమన్వయకర్త లక్కాకుల సతీష్ కుమార్, మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ పైడాల శ్రీనివాసరెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పుట్టోజు శారద బ్రహ్మచారి, పరశురాం, బి. కృష్ణ,యాపర్ల రామ్ రెడ్డి,గోనూరు రాజు,ఖాజా బాబా తదితరులు పాల్గొన్నారు.



## దాసిరెడ్డిగూడెంలో దశదినకర్మకు హాజరైన ప్రముఖులు

**వలిగొండ,ఫిబ్రవరి 2(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం దాసిరెడ్డిగూడెం గ్రామం, రామన్నపేట కోర్టులో జడ్జిగా విధులు నిర్వహిస్తున్న శ్రీ దంతూరి సత్తయ్య గౌడ్ తల్లి అంజమ్మ గత వారం క్రితం మరణించారు సోమవారం రోజు దశదినకర్మ సందర్భంగా వలిగొండ గ్రామ సర్పంచ్ వెంకట పాపిరెడ్డి అంజమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు,రాజకీయ నాయకులు గ్రామస్తులు బంధువులు విద్యావేత్తలు అంజమ్మ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.



## మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి.

- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.**

**వనపర్తి ఫిబ్రవరి 2 (ప్రజాస్వరం):**

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం నాడు నర్సింగాపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం ఏర్పాటు చేయనున్న ప్రతి టేబుల్ వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బందికి, ఏజెంట్లకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఒక అభ్యర్థికి ఒక ఏజెంట్ చొప్పున ఐడి కార్డులు జారీ చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మరియు లెక్కింపు కేంద్రం పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య, ఇతర ఉన్నతాధికారులు మరియు రెవెన్యూ సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.



# ఆదిలాబాద్ జిల్లాను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

- ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వే లైన్ పై ఎంపీ గేడం నగేష్ కి చిత్తశుద్ధి లేదు
- నలుగురు ఎమ్మెల్యేలను ఆదిలాబాద్ ఇచ్చిన ఒక యూనివర్సిటీ ఇవ్వలేకపోయారు
- సీసీఐ పునరుద్ధరణ, హైదరాబాద్ నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్ ఉసేత్తని కేంద్ర బడ్జెట్
- మాటల్లో తప్ప చేతల్లో కానరాని ఆదిలాబాద్ విమానాశ్రయం
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి



**ఆదిలాబాద్ జిల్లా ఫిబ్రవరి 02(ప్రజాస్వరం):**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఆదిలాబాద్ జిల్లాకు న్యాయంగా రావలసిన విమానాశ్రయం, యూనివర్సిటీ, ఆర్మూర్ ఆదిలాబాద్ రైల్వే లైన్, హైదరాబాద్ నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్ నిధులు, వెనుకబడిన జిల్లాలకు ఇచ్చే నిధులు, సీసీఐ పునరుద్ధరణ సంబంధించి ఏ అంశాలు చర్చకు రాకపోవడం బాధాకరమని, ఈ విషయంలో ఆదిలాబాద్ జిల్లా ఎంపీ ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి విమర్శించారు.ఈ సందర్భంగా బోథ్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గొర్రె తోక బెత్తెడు అన్న చందంగా స్థానిక ఎంపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు మాటలు తప్ప చేతల్లో అభివృద్ధిని చూపెట్టలేరని దానికి నిదర్శనమే ఈ కేంద్ర బడ్జెట్ అని పేర్కొన్నారు.అదిలాబాద్ జిల్లాకే కాకుండా తెలంగాణకు కూడా తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోలేదని, కేవలం ఓట్ల రాజకీయాల కోసమే దక్షిణ భారతదేశాన్ని వాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు.గ్రామీణ భారతానికి ఉతమిచ్చే వ్యవసాయ రంగానికి, ఉపాధికి నిధులు తగ్గించారని, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు లేవని, పర్వతప్రాంతాల్లో నివసించే ప్రజల కోసం ప్రత్యేక రోడ్ల ప్యాకేజీ ఇవ్వవలసి ఉన్న ఇవ్వలేదని, వ్యవసాయానికి సంబంధించిన ఎరువుల ముడి సరుకుల రేట్లు పెంచుతూ తీసుకున్న నిర్ణయం రైతాంగాన్ని కుంగదిస్తుందని, పేదవారి ఆత్మగౌరవానికి సంబంధించిన ఇంటి నిర్మాణంలో కూడా నిధులు పెంచకుండా కేవలం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి 72వేల రూపాయలు మాత్రమే ఇవ్వడం బిజెపి సంకుచిత బుద్ధికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.కిసాన్ సమ్మాన్ నిధులు ఆరువేల రూపాయలు నుంచి పదివేల రూపాయలు పెంచుతామని ఒక దంపుడు ఉపాన్యాసాలు ఇచ్చి బడ్జెట్లో పెంచకపోవడం హాస్యాస్పదం అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ఎంపీలు ఎమ్మెల్యేలు ఈ విషయంపై మాట్లాడాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోద్దు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, మాజీ ఎంపిటిసి చట్ల ఉమేష్, మార్కెట్ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, ఆత్మా డైరెక్టర్ రహీముద్దీన్, ధన్నూర్ ఉప సర్పంచ్ కారం రవి, చమేందర్ రెడ్డి, మహమ్మద్, ఆత్రం సుశీల, ఆత్మా డైరెక్టర్ గడ్డల నారాయణ, అనిల్ అప్ప, మెరుగు నరసింహ దాసు మాజీ సర్పంచ్, ఇట్టేడి రాజు రెడ్డి, యువ నాయకులు అచ్యుతానంద రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మున్సిపోరులో ఊపందుకున్న కాంగ్రెస్ ప్రచారం

**తూప్రాన్ ఫిబ్రవరి 2 (ప్రజాస్వరం) :**

తూప్రాన్ మున్సిపాలిటీలో ఎన్నికల సందడి మొదలైంది అరు వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా గడపగడపకు ప్రచారం కొనసాగుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు 200 యూనిట్ల. వరకు విద్యుత్ బిల్లు ఫ్రీగా చేసిందని రేషన్ కార్డు ఉన్న ప్రతి బడుగు బలహీన వర్గాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తూప్రాన్ మున్సిపాలిటీకి 16 కోట్ల రూపాయలు అభివృద్ధి కోసం మంజూరు జరిగాయని వార్డుల వారీగా సిసి రోడ్లకు మురికి కాలువలకు పనులు ప్రారంభమయ్యాయని మున్సిపల్ ఏర్పడ్డాక మరిన్ని నిధులతో వార్డులో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బాలేష్ గుప్తా రాజులు ప్రణయ్ రాజేష్ విట్టల్ రెడ్డి వెంకట్ నితీష్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ మున్సిపల్‌లో బీజేపీకి షాక్

- అసెంబ్లీ కన్వీనర్ రాజీనామా



**మెదక్ ఫిబ్రవరి 02 (ప్రజా స్వరం)**

మున్సిపల్ ఎన్నికల్లో వేళ మెదక్ లో బీజేపీ కి బిగ్ షాక్ ఎదురైంది. బీజేపీ మెదక్ అసెంబ్లీ కన్వీనర్ ఎక్కలదేవి మధుసూదన్ రాజీనామా చేస్తున్నట్లు మీడియా సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లు గా బీజేపీ అనుబంధ సంస్థ ల్లో క్రియాశీలకంగా పని చేస్తున్నాని ఆయన ను కాదని పార్టీ వేరే వ్యక్తి కి బి ఫారం ఇవ్వడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ నుంచి 28 వ వార్డ్ అభ్యర్థి గా నిలబడేందుకు బి ఫారం ఆశించనని, కానీ బీజేపీ పార్టీ లో కనీసం సభ్యత్వం లేని వ్యక్తి కి పార్టీ బి ఫారం ఇవ్వడం జరిగిందని అన్నారు. పార్టీ లో పని చేసిన గుర్తింపు లేకపోవడంతో పార్టీ కి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. బి ఫారం విషయంలో పార్టీ లో నాయకులు వారి స్వలాభం కోసమే ఇదంతా చేశారని ఆయన ఆరోపించారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

**దౌల్తాబాద్ ఫిబ్రవరి 2 (ప్రజాస్వరం) :**

పాఠశాలలు, ఆసుపత్రుల్లో విధులు నిర్వహించే అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. సోమవారం దౌల్తాబాద్ మండలంలోని ఇందుప్రియ గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదటగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఫార్మసీ స్టోర్, ల్యాబ్, ఇంజక్షన్ గదులను తనిఖీ చేసి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. కంటి చూపు సమస్యతో పీహెచ్‌సీకి వచ్చిన ఓ వృద్ధునితో మాట్లాడిన కలెక్టర్, దృష్టి లోపం అధికంగా ఉంటే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి (జిజిఎచ్)కు రిఫర్ చేయాలని సూచించారు. ఆకుకూరలు ఎక్కువగా తినాలని, రాగి జావా సేవించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని రోగులకు సూచించారు. పీహెచ్‌సీ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుతూ చెట్లకు నిత్యం నీరు పోయించాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో ఒకే కూర టమాటా పప్పు, హైస్కూల్‌లో పప్పుతో పాటు ఆలుగడ్డ టమాటా సరిపడినంత వండలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు ప్రకారం భోజనం వండాలి కానీ మీ ఇష్టానుసారంగా వండి నిర్లక్ష్యం వహిస్తున్నారని పాఠశాల ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యకు తగినంత కూరగాయలు వండనందుకు ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని డీఈఓకు ఫోన్ ద్వారా ఆదేశించారు. కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు సరిపడినంత పోషకాహారం అందించాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎట్టి



పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. అనంతరం పాఠశాల కిచెన్ గార్డెన్‌ను పరిశీలించిన కలెక్టర్, కొత్తిమీర, తోటకూర, మెంతికూర వంటి ఆకుకూరలను నిత్యం కూరల్లో వినియోగించాలని సూచించారు. గార్డెన్‌లో కలుపు తొలగించి రోజూ నీరు పోయాలని వంట సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గజ్జల కనకరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మెదక్ మున్సిపల్‌లో బోణీ కొట్టిన కాంగ్రెస్

**మెదక్, ఫిబ్రవరి 02 (ప్రజా స్వరం) :**

మెదక్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ బోణి కొట్టింది. 32 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న గోదల మానస సాయిరాం వరుసగా రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదే వార్డు నుంచి బీఆర్ఎస్ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన గోదల జ్యోతి నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మానస ఏకగ్రీవమయ్యారు. 2020లో బీఆర్ఎస్ పార్టీ తరఫున మానస నామినేషన్ వేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇది మానస వరుసగా రెండుసార్లు ఏకగ్రీవం విశేషం.

## చేసిన అభివృద్ధే మమ్మల్ని గెలిపిస్తుంది

- బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి గుంటుకు శిరీష రాజు

**గజ్వేల్, 02 ఫిబ్రవరి (ప్రజాస్వరం) :**

గతంలో మేము చేసిన అభివృద్ధి పనులే ఈ ఎన్నికల్లో మా విజయానికి నాంది పలుకుతాయి అని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 14వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి గుంటుకు శిరీష రాజు అన్నారు. సోమవారం సిద్ధిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా గుంటుకు శిరీష రాజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్ళి ఓటర్లను కలుసుకుని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు ప్రజల నుండి తమకు అనూహ్యమైన స్పందన లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు ఇంకా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో కౌన్సిలర్ గా పనిచేసిన అనుభవంతో వార్డులో 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని గుర్తు చేశారు. మిగిలిన పనులను కూడా గెలిచిన వెంటనే పూర్తి చేస్తామని వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు. తమ పనితీరును గుర్తించి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వార్డు మహిళా నాయకులు పాల్గొన్నారు.





## మెదక్ మున్సిపాలిటీపైన కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

**మెదక్ ఫిబ్రవరి 02 (ప్రజా స్వరం) :**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ మున్సిపాలిటీ లోని 29 వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి బొద్దుల క్రిష్ణ గెలిపించాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. జరుగుతున్న మెదక్ మున్సిపల్ బాల్దీయా మీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయం అన్నారు. మున్సిపాలిటీ లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు అయ్యాయని మున్సిపల్ ఎన్నికల అనంతరం పనులు సైతం ప్రారంభించుకోవడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన ఉంటూ సమస్యల ను పరిష్కరిస్తుందని అన్నారు.

## మొక్కలు నాటిన సర్పంచ్ ప్రియా నాయక్

**చిన్న శంకరంపేట, ఫిబ్రవరి 2 (ప్రజాస్వరం) :**

చిన్న శంకరంపేట మండలం ఖాజాపూర్ తాండ గ్రామంలో దుర్గామాత దేవాలయం వద్ద స్థానిక సర్పంచ్ ప్రియానాయక ఆధ్వర్యంలో మొక్కలు నాటారు, నాటిన మొక్కలను సంరక్షించుకునే బాధ్యత అందరం తీసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రియా నాయక్ తో పాటు ఉప సర్పంచ్ నరేష్ లైన్ మెన్ కనకయ్య కావేరి పరిశ్రమ హెచ్ఆర్ ఓం ప్రకాష్ పంచాయతీ కార్యవర్గ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999